క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



సతీష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని రంగుల తయారీ పరిశ్రమలో జరిగిన పేలుళ్లలో మృతి చెందిన కోటంకకు చెందిన చాకలి సతీష్ మృతదేహాన్ని సర్వజనాస్పత్రి మార్చురీలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శనివారం సందర్శించారు. కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశం వాయిదా

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని వాయిదా వేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ శనివారం తెలిపారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీకి చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ వ్యవహరించనున్నారు. అయితే కలెక్టర్ బదిలీపై వెళ్తుండడంతో కమిటీ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సమావేశం నిర్వహించే తేదీని త్వరలో వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

అభాగ్యురాలికి 'అమ్మ' చేయూత



రాజేశ్వరికి కుట్టుమిషన్ అందిస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: నగరంలోని మూడో రోడ్డుకు చెందిన రాజేశ్వరి అనే మహిళకు అమ్మ స్వచ్ఛంద సంస్థ తరిమెల రమణారెడ్డి చేయూతనందించారు. రాజేశ్వరికి 13 ఏళ్ల క్రితం పెళ్లయ్యింది. ఏడాది తర్వాత మానసిక వైకల్యంతో బాబు (సాయి) జన్మించాడు. అతన్ని వదిలించుకోవాలని భర్త ఒత్తిడి తెచ్చినా ఆమె ససేమిరా అనింది. దీంతో ఆమెను భర్త వదిలేశాడు. కొడుకుతోపాటు ఎవరో వదలేసి వెళ్లిపోయిన చిన్నారి మంజును కూడా పోషిస్తోంది. విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ తరిమెల రమణారెడ్డి శనివారం రాజేశ్వరికి కుట్టుమిషన్ అందజేశారు. మరో రూ.10 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు అందించాడు. కొడుకు సాయికి సర్జికల్ స్టాండ్, ఇతర మందులు కూడా వితరణ చేశారు.

రైతుబజార్‌లో కార్బైడ్ రహిత 'మామిడి'



సహజ సిద్ధంగా మాగబెట్టిన మామిడిపండ్లు

అనంతపురం అగ్రికల్చర్: వేసవిలో వచ్చే మధురఫలం, ఫలరాజుగా పేరొందిన మామిడి మార్కెట్‌లోకి వచ్చింది. ఏప్రిల్ నుంచి జూన్, జూలై వరకు మామిడి సీజన్ కొనసాగుతుంది. ఉమ్మడి జిల్లా పరిధిలో మామిడి సాగు విస్తీర్ణం అధికంగా ఉండటంతో జిల్లా అంతటా మామిడి అమ్మకాలు మొదలయ్యాయి. అందులో భాగంగా సహజ సిద్ధంగా మాగబెట్టిన కార్బైడ్ రహిత మామిడి పండ్లను స్థానిక రైతు బజార్‌లో అమ్మకాలకు ఉంచారు. గార్లదిన్నె మండలం ఇల్లూరుకు చెందిన రైతు శ్రీనివాసులు తన తోటలో పండించి, వరిగడ్డిలో మాగబెట్టిన మామిడి పండ్లను విక్రయిస్తున్నారు. ఏటా మాదిరిగా ఒకట్రెండు రోజుల్లో మరో ఇద్దరు ముగ్గురు రైతులు కూడా కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు రైతుబజార్ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం కిలో రూ.80 ప్రకారం మామిడి పండ్లు అమ్ముతున్నట్లు తెలిపారు.

అశ్వవాహనంపై సీతారాముల ఊరేగింపు



అశ్వవాహనంపై సీతారాములును ఊరేగిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: స్థానిక మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండరామాలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు జరిగాయి. బ్రహ్మోత్సవాలు తొమ్మిదిరోజుల పాటు వైభవంగా జరిగాయి. వాహన సేవల్లో భాగంగా శనివారం సాయంత్రం సీతారాములును అశ్వవాహనంపై ఊరేగించారు. గ్రామీణ ప్రాంతాల కళాకారుల భజనలు, భక్తి సంకీర్తనలు, వేదమంత్రాల నడుమ సీతాసమేత కోదండరాముడిని ఊరేగించారు. ఈవో సుధారాణి మాట్లాడుతూ పదిరోజుల పాటు భక్తిభావాన్ని నింపిన బ్రహ్మోత్సవాలు ఆదివారం వసంతోత్సవంతో ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో అర్చకులు హర్షశర్మ, నరసింహమూర్తి, ధర్మకర్తల మండలి సభ్యులు తిమ్మారెడ్డి, వెంకటస్వామి, సురేష్ కుమార్, సుబ్రమణ్యం, చంద్ర పాల్గొన్నారు.

జన నినాదం..'జగనన్నే మా భవిష్యత్'

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, చిత్రంలో కార్పొరేటర్ హరిత



లక్ష్మీనగర్‌లోని పథకాలపై మహిళను అడుతున్న మేయర్ వసీం సలీం

అనంతపురం క్రైం: వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత అర్హత ఉంటే చాలు.. సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయి.. భవిష్యత్‌లోనూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలని, మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని ప్రతి ఇంటా కోరుకుంటున్నారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని 23వ డివిజన్‌లో కార్పొరేటర్ హరిత ఆధ్వర్యంలో చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్పొరేటర్‌తో కలసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లిన ఎమ్మెల్యే.. ప్రజామద్దతు పుస్తకంలో ఉన్న ఐదు ప్రశ్నలను లబ్ధిదారులను అడిగి సమాధానాలు రాబట్టారు. గత టీడీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల వారు పడిన ఇబ్బందులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు గుర్తు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో మీ జీవితాల్లో మెరుగు కన్పించిందా? ఇంకా మీరేమైనా ప్రభుత్వం నుంచి రావాలని కోరుకుంటున్నారనని లబ్ధిదారులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడే ఉన్న గృహ సారథులు, కన్వీనర్లకు ఎమ్మెల్యే సూచనలు, సలహాలు అందించారు. ప్రతి క్లస్టర్‌లోని లబ్ధిదారుల ఇళ్లను తప్పక సందర్శించాలన్నారు.

లోకేష్‌పై మండిపడిన 'అనంత':

యువగళం పేరిట టీడీపీ నేత లోకేష్ చేస్తున్న పాదయాత్రలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలను లక్ష్యంగా చేసుకొని..లోకేష్ చేస్తున్న ఆరోపణలపై ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. 14 ఏళ్ల పాటు సీఎంగా పని చేసిన చంద్రబాబు.. గత ప్రభుత్వంలో మంత్రి ఉన్న లోకేష్ ప్రజలకు ఏం ఒరగ పెట్టారని ప్రశ్నించారు. అధికార దాహం కోసం పాదయాత్ర చేపడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తూ..ఇళ్లు, విద్య, వైద్యం, తదితర సంక్షేమం అందిస్తోందన్నారు. లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా రూ.2 లక్షల కోట్లు జమ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఒంటరిగా పోటీ చేస్తే దమ్ముధైర్యం లేక ప్రతిపక్షాలతో కుమ్మక్కు రాజకీయాలకు పాల్పడుతున్న టీడీపీకి రానున్న ఎన్నికల్లోనూ ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారన్నారు. 2024లోనూ మరోసారి వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఊపందుకున్న కార్యక్రమం:

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశాలతో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం శనివారం నగరంలో ఊపందుకుంది. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు, జేసీఎస్ కన్వీనర్లు చింతా సోమశేఖర్ రెడ్డి, కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, చింతకుంట మధు, బండి శ్రీకాంత్ తదితరులు వివిధ క్లస్టర్లలో కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహించారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, పార్టీ శ్రేణులు కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారు. 38వ డివిజన్‌లో మేయర్ వసీం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని ప్రజలకు వివరించారు.

అనంతపురం రూరల్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజల నమ్మకమని జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం ఏనారాయణపురం పంచాయతీ పరిధిలోని తపోవనంలో వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. జేసీఎస్ కర్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో అన్ని వర్గాల ప్రజలకూ న్యాయం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లెల వేణుగోపాల్, బి.మదన్‌మోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు శృతి, హాజీవలి పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ' జగనన్నే మా భవిష్యత్ .. మా నమ్మకం నువ్వే జగన్ ' కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. గ్రామ సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ వలంటీర్లు ప్రతి ఇంటికీ తిరుగుతూ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు అందాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వడ్డుపల్లి సర్పంచ్ లక్ష్మీనారాయణ రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ వడ్డుపల్లి నరసింహారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థికి తీవ్ర గాయాలు

రాప్తాడు: మండలంలోని మరూరుకు చెందిన పదో తరగతి విద్యార్థి బి.మంజు శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఎంఈఓ మల్లికార్జున తెలిపిన మేరకు.. మరూరుకు చెందిన బి.మంజు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. శనివారం ఇంగ్లిష్ పరీక్ష ఉండడంతో ద్విచక్ర వాహనంలో ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్లో పరీక్ష రాయడానికి బయల్దేరాడు. మరూరు సమీపంలోని 44వ జాతీయ రహదారిపై రోడ్డు డివైడర్‌ను ఢీకొనడంతో మంజుకు కాలు విరిగింది. 108 వాహనం ద్వారా అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. శనివారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షకు ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ తెలిపారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



మ్యాన్‌ఆఫ్‌ద మ్యాచ్ అవార్డు అందిస్తున్న ఆర్గనైజర్లు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ కొడిమి పంచాయతీ ప్రజాచైతన్య కాలనీలో సమ్మర్ హార్డ్ టెన్నిస్ క్రికెట్ టోర్నీ శనివారం ప్రారంభమైంది. తొలిరోజు పోటీలు ఉత్సాహంగా సాగాయి. పాపినేపాళ్యం-క్రిక్ బాయ్స్, ఆర్మీ టీమ్-కనగానపల్లి, బ్యాంకర్స్11-పీపీ వారియర్స్ జట్ల మధ్య పోటీలు జరిగాయి. క్రిక్ బాయ్స్, ఆర్మీ టీమ్, బ్యాంకర్స్11 జట్లు విజయం సాధించాయి. మ్యాన్‌ఆఫ్‌ద మ్యాచ్ అవార్డులను టోర్నీ ఆర్గనైజర్లు బండి ఆనంద్, ఆదిరెడ్డి అందజేశారు. విజేత జట్టుకు రూ. 30 వేలు, రన్నర్ జట్టుకు రూ. 15 వేలు నగదు బహుమతులు అందజేయనున్నట్లు ఆర్గనైజర్లు తెలిపారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే



ఐదో రోడ్డు మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత, మేయర్ వసీం తదితరులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని ఐదో రోడ్డులో ఉన్న మహమ్మదీయ మసీదులో ముతవల్లి జెడ్పీ షెక్షావలి ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నగర మేయర్ మహమ్మద్ వసీం సలీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇసాక్, రహంతుల్లా, 46వ డివిజన్ కన్వీనర్ దాదాఖలందర్, వైఎస్సార్‌సీపీ నాయకులు కువైట్ ఖాదర్‌బాషా, షెక్షావలి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి బాధాకరం



మంజిత్‌కుమార్‌రెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం జంగాలపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చింతపంటి వెంకటరామిరెడ్డి కుమారుడు మంజిత్‌కుమార్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. వెంకటరామిరెడ్డి కుటుంబం ప్రస్తుతం అనంతపురం హౌసింగ్ బోర్డులో నివాసం ఉంటోంది. బెంగళూరులో పని చేస్తున్న మంజిత్‌కుమార్‌రెడ్డి బైకులో వస్తూ దాదులూరు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యేలు శనివారం అనంతపురం సర్వజనాస్పత్రిలోని మార్చురీ గదికి చేరుకొని మృతదేహాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతపురం, రాప్తాడు మార్కెట్ యార్డ్ చైర్మన్లు ఫయాజుద్దీన్, బెడదూరి గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ అనంతపురం రూరల్ మండల కన్వీనరు దుగుమర్రి గోవిందరెడ్డి, నాయకులు పోతులయ్య, గోపాల్‌రెడ్డి, నాగార్జునరెడ్డి తదితరులు ఉన్నారు.

నేత్రదానానికి అంగీకారం :

పుట్టెడు దుఃఖంలోనూ మృతుడి తండ్రి వెంకటరామిరెడ్డి కుమారుడి నేత్రాలు దానం చేయడానికి ముందుకొచ్చారు. కుమారుడు భౌతికంగా లేకపోయినా ఆయన కళ్లు మరొకరి జీవితాల్లో వెలుగు నింపుతుందని భావించి కళ్లదానానికి అంగీకరించారు. వైద్యులు మంజిత్‌కుమార్‌రెడ్డి కళ్లను సేకరించారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని, నగర శివారులోని అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండో శనివారం ఆయా కేంద్రాల్లో గర్భిణులు, చిన్నారులకు టీకాలు, ఐరన్ మాత్రలను సక్రమంగా అందిస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. నారాయణపురం 4, కేకే కాలనీ 2, రుద్రంపేట 2, పాపంపేట 1, నందమూరి నగర్ 1, చంద్రబాబు కొట్టాల 1 అంగన్‌వాడీ కేంద్రాలు, వాటి పరిధిలోని రెండు సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు.

ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

అనంతపురం టవర్‌క్లాక్: ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ దివాకర్ రావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద అమరావతి జేఏసీ ఆధ్వర్యంలో నల్లకండువాలతో నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా జేఏసీ చైర్మన్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర నేత బొప్పరాజు వెంకటేశ్వర్లు పిలుపుమేరకు నిరసన తెలియజేశామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు కుళ్లాయప్ప, మారుతీప్రసాద్‌రెడ్డి, సాయినాథ్‌రెడ్డి, సుబ్రమణ్యం, కొండయ్య, శివకృష్ణ, నారాయణస్వామి, భరత్‌కుమార్, సంజీవరాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం: అనంతపురం జిల్లా కోర్టులో ఫ్యామిలీ కోర్టు జడ్జి తిరుమలరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే విశ్వనాథ రెడ్డి శనివారం చలివేంద్రం ప్రారంభించారు. ఐఎంఎం ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మహబూబ్ బాషా ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఫ్యామిలీ సమస్యలపై కోర్టుకు హాజరయ్యే మహిళలు, వృద్ధులకు దాహార్తి తీర్చేలా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమని జడ్జి తిరుమలరావు అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటరాముడు, కోశాధికారి లక్ష్మీనారాయణ రెడ్డి, న్యాయవాది అజీజ్, సీనియర్ న్యాయవాదులు ,మహిళా న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ అధికారులు నగరపాలక సంస్థ కార్యాలయం, ఆర్ట్స్ కళాశాల, కోర్టు రోడ్డు, క్లాక్‌టవర్ ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పేదల సంక్షేమమే జగనన్న ఆశయం



'జగనన్న మా భవిష్యత్తు' పోస్టర్లను పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు

రాప్తాడు: పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రం రాప్తాడులో రెండో రోజూ జగనన్న మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పథకాలను వివరించారు. పథకాల వివరాలతో కూడిన కరపత్రం ప్రజలకు అందించారు. కార్యక్రమంలో మారూరు సొసైటీ అధ్యక్షుడు మాచిరెడ్డి కొండా రెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణస్వామి, మాజీ వైస్ ఎంపీపీ గవ్వల పరంధామ, వైఎస్సార్ సీపీ నాయకులు రవికుమార్, సాకే చంద్ర, ముత్యాలు, జయన్న, మాచిరెడ్డి చెన్నారెడ్డి, నరసింహ రెడ్డి, చిరుతల నాగేంద్ర, కపాడం ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వనభోజనాలు



వంటలు చేసుకుంటున్న మహిళలు



వనభోజనాలకు తరలివెళ్తున్న గ్రామస్తులు

చెన్నేకొత్తపల్లి: మండలంలోని బసినేపల్లిలో శనివారం ఊరంతా వనభోజనాలకు వెళ్లారు. ఉదయమే గ్రామస్తులందరూ ఇళ్లు ఖాళీ చేసి, వంటసామగ్రి గంపలకు ఎత్తుకొని చిన్నాపెద్దలు అంతా ఊరుబయట చెట్లకిందకు వెళ్లారు. పిండివంటలు అక్కడే చేసుకొని సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ఏటా శ్రీరామనవమి పండుగ అనంతరం గ్రామంలో వనభోజనాలకు వెళ్లడం ఆనవాయితీ అని గ్రామస్తులు తెలిపారు.

బాధ్యతగా పనిచేయండి

రాప్తాడురూరల్: కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూళ్ల నిర్వహణ పూర్తి బాధ్యత ప్రిన్సిపాళ్లదేనని జిల్లా విద్యాధికారి సాయిరాం అన్నారు. శనివారం కేజీబీవీ ఎస్‌ఓలు, మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లతో డీఈఓ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్పెషల్ ఆఫీసర్లు, ప్రిన్సిపాళ్లు బాధ్యతగా పని చేయాలన్నారు. నాడు-నేడు పనులను పర్యవేక్షించాలన్నారు. అభివృద్ధి పనులు ఎలా జరుగుతున్నాయో తెలుసుకోవాలని, నిర్లక్ష్యం చేసి ఎవరినో బాధ్యులను చేయాలని చూస్తే వినేపరిస్థితిలేదన్నారు. బైజూస్ కంటెంట్‌ను అర్థవంతంగా ఉపయోగించేలా చూడాలన్నారు. విద్యార్థులు ట్యాబ్‌లు ఇళ్లల్లో ఎలా వాడుతున్నారనే విషయంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. రోజూ ఉదయం ప్రార్థనలో ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థులకు తెలియజేయాలన్నారు. కేజీబీవీలు, మోడల్ స్కూళ్ల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తూ విద్యార్థుల చదువుకు ఆటంకం కలిగితే ఎవరినీ ఉపేక్షించబోమని హెచ్చరించారు.





సిరిమామిడి చెట్టు!

వేసవి వచ్చిందంటే..మామిడి పండ్లు గుర్తుకొస్తాయి. వేసవిలో కాసే మామిడి పండ్లకు భలే గిరాకీ. తినకపోయినా వాసన చూస్తే చాలనుకునే పండ్లలో మామిడి ఒకటి. తోటకెళ్లాల్సిన పనిలేదు..మార్కెట్‌లో కొనాల్సిన అవసరమూ లేదు. ఇదిగోఅనంతపురంలోని భైరవనగర్‌లో ఓ ఇంటి ముందు విరగ్గాసిన మామిడి చెట్టు ఇలా ఆకర్షిస్తోంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం :

ఉత్సాహంగా రన్ ఫర్ జీసెస్

- శాంతి పరుగును ప్రారంభించిన ఎమ్మెల్యే అనంత



రన్ ఫర్ జీసెస్‌లో పాల్గొన్న క్రైస్తవులు



రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కల్చరల్: నగరంలో రన్ ఫర్ జీసెస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పడిన కమిటీ కన్వీనర్ డాక్టర్ బెన్‌హర్‌బాబు నేతృత్వంలో రెవరెండ్ సంపత్ విజయ్‌కుమార్ ప్రార్థనలు చేయించారు. విశిష్ట అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి జెండా ఊపి రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయనతో పాటు ఏపీ నాటక అకాడమీ చైర్మన్ రాగే హరిత, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కరరెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు రెవరెండ్ మోజెస్ అనిల్‌కుమార్ , రెవరెండ్ నెహమ్యా నాగరాజు, మనుష్యే, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు జాన్ వెస్లీ, డేనీ, పాస్టర్ మనుష్యే, వైఎస్సార్‌సీపీ నాయకులు చామలూరు రాజగోపాల్ మాట్లాడారు. అనంతరం స్థానిక సీఎస్ఐ చర్చి నుంచి కోర్టురోడ్డు, టవర్‌క్లాక్, సుభాష్‌రోడ్డు మీదుగా సప్తగిరి సర్కిల్‌లోని ఎస్ఐయూ చర్చి వరకు శాంతిపరుగు సాగింది.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాల పీజీ విద్యార్థిని నర్మద హాస్టల్‌లో శనివారం ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాలు..నర్మదా హాస్టల్ రూంలో ముగ్గురు విద్యార్థినులు ఉంటున్నారు. ఇద్దరికి మాత్రమే మంచాలు (బెడ్లు) ఉన్నాయి. మంచం లేని కారణంగా ఇద్దరు విద్యార్థినులు ఘర్షణ పడ్డారు. ఇదే సమయంలో వేరే గదిలోకి వెళ్లి అక్కడే ఉన్న ఫ్యాన్‌కు చున్నీ తగిలిస్తుండడగా, తోటి విద్యార్థినులు గమనించి నివారించారు. అంతలోనే ఉన్నతాధికారులు కలగజేసుకొని ఇద్దరినీ ఒకే గదిలో ఉంచకుండా చెరో గది కేటాయించి, లగేజీ మార్పించారు. ఇద్దరు విద్యార్థినుల తల్లిదండ్రులు వచ్చి వారికి నచ్చజెప్పి వెళ్లిపోయారు.విద్యార్థినులు మంచంలేదని ఘర్షణపడి ప్రాణాలు తీసుకునే వరకూ రావడంపై చర్చనీయాంశమైంది.

'పది' పరీక్షలకు ఐదుగురు గైర్హాజరు

కనగానపల్లి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శనివారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షకు ఐదుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ అరుణమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్, మోడల్ స్కూళ్లలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 376 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఈ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేసి, పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు.

సాక్షి అనంతపురం

ఆదివారం । 9 । ఏప్రిల్ । 2023




నెత్తురోడిన రహదారి
జిల్లాలో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. పలువురు గాయపడ్డారు. అతివేగం నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణం. 8లో



టమాట కిలో రూ.8
అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.8 పలికింది.

గరిష్టం/కనిష్టం
40.8°/23.6°
జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత కొనసాగుతోంది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.



1998-డీఎస్సీ అభ్యర్థులు 536 మంది

- 12, 13 తేదీల్లో కౌన్సెలింగ్

రాప్తాడురూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో 536 మంది 1998-డీఎస్సీ అభ్యర్థులను గుర్తించారు. మొత్తం 570 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను గతంలో ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వీరిలో 60 ఏళ్ల పైబడిన వారు 34 మంది పోను తక్కిన 536 మందికి పోస్టులు ఇచ్చే అవకాశం ఉంది. మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) ఆధారంగా ఎస్జీటీలుగా నియమించనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూలు శనివారం రాత్రి విడుదల చేశారు. ఈ నెల 12, 13 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ ఎం.సాయిరామ్ తెలిపారు. 10న జాబితాకు జిల్లా ఎంపిక కమిటీ ఆమోదం తెలుపుతుందని, 11న అభ్యర్థులకు కౌన్సెలింగ్ సమయం ప్రకటిస్తామన్నారు. 12, 13 తేదీల్లో కౌన్సెలింగ్ ద్వారా నియామక ఉత్తర్వులు అందజేస్తామని వెల్లడించారు.

పాలకమండళ్ల భర్తీకి కసరత్తు



ఎస్కేయూ ముఖద్వారం



జేఎన్టీయూ ముఖద్వారం

- సమర్థులైన ప్రొఫెసర్ల జాబితా సిద్ధం
- 15 మంది సభ్యులతో పాలక మండలి
- ఇందులో ఎక్స్ అఫిషియో సభ్యులు ఐదుగురు
- తక్కిన పది మంది వివిధ రంగాల్లో నిపుణులు
- ఎస్కేయూ, జేఎన్‌టీయూఏలో పలువురు ఆసక్తి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ), జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం అనంతపురం (జేఎన్‌టీయూఏ) పాలక మండళ్ల సభ్యుల నియామకానికి కసరత్తు జరుగుతోంది. ఇది వరకు ఉన్న పాలకమండలి సభ్యుల మూడేళ్ల గడువు గత వారమే పూర్తయ్యింది. ఒక్కో పాలకమండలిలో మొత్తం 15 మంది సభ్యులు ఉంటారు. ఇందులో ఐదుగురు ఎక్స్ అఫిషియో సభ్యులు, తక్కిన 10 మంది వివిధ రంగాల్లోని నిపుణులు ఉంటారు. ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ, కళాశాల విద్య స్పెషల్ కమిషనర్, డిప్యూటీ ఫైనాన్స్ అడ్వైజర్, ఉన్నత విద్యామండలి చైర్మన్, రెక్టార్ పాలకమండలిలో ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉంటారు. తక్కిన 10 మందిలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, ఒక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ఒక డిగ్రీ కళాశాల లెక్చరర్, ఇద్దరు సీనియర్ ప్రొఫెసర్లు, వివిధ రంగాల్లో నిష్ణాతులైన నలుగురు ప్రముఖులు, పాలకమండలి సెక్రెటరీగా రిజిస్ట్రార్ ఉంటారు. పాలకమండలి చైర్మన్‌గా వీసీ వ్యవహరిస్తారు.

సమగ్ర వివరాల సేకరణ..

ఇద్దరు సీనియర్ ప్రొఫెసర్లు, ఒక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ఒక డిగ్రీ కళాశాల లెక్చరర్లలో ఎవరు సమర్థులు అనే అంశంపై ఇప్పటికే సమగ్ర వివరాలను ఎస్కే యూనివర్సిటీ ఉన్నతాధికారులు సేకరించారు. వీటిని ఉన్నత విద్యామండలికి పంపారు. సామాజిక సమతూకం ఉండే రీతిలో వివరాలు పంపాలని ఉన్నత విద్యామండలి నిర్దేశించింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరి ప్రొఫెసర్లు 50 శాతం పైగా ఉండాలని పేర్కొన్న నేపథ్యంలో ఆ మేరకు వివరాలు పంపారు. ఇందులోనూ మహిళలకు సింహభాగం కేటాయించనున్నారు. ఎస్కేయూ క్యాంపస్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ కృష్ణకుమారి ఇటీవలే నియమితులయ్యారు. ప్రిన్సిపాల్ కోటాలో ప్రొఫెసర్ కృష్ణకుమారి పేరును పాలకమండలి సభ్యుల జాబితాలో చేర్చినట్లు తెలిసింది. జేఎన్‌టీయూఏ పాలకమండలి సభ్యుల నియామకంపై పూర్తిస్థాయిలో స్పష్టత రాలేదు. పాలకమండలి సభ్యుల స్థానాల కోసం ఎస్కేయూ, జేఎన్‌టీయూఏలో పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు.

అనంతపురం రేంజ్ డీఐజీగా అమ్మిరెడ్డి

- నూతన ఎస్పీగా శ్రీనివాసరావు
- ఇక్కడి డీఐజీ రవిప్రకాష్ సెబ్‌కు బదిలీ
- ఎస్పీ ఫక్కీరప్ప సీఐడీ విభాగానికి..



ఆర్.ఎన్.అమ్మిరెడ్డి



శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం రేంజ్ డీఐజీగా ఆర్.ఎన్.అమ్మిరెడ్డి నియమితులయ్యారు. ఇక్కడ డీఐజీగా పనిచేస్తున్న ఎం.రవిప్రకాష్ సెబ్ డీఐజీగా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2009 బ్యాచ్‌కు చెందిన అమ్మిరెడ్డి ప్రస్తుతం డీజీపీ కార్యాలయంలో అడ్మిన్‌గా పనిచేస్తున్నారు. గతంలో గుంటూరు ఎస్పీగానూ పనిచేశారు.

- అనంతపురం నూతన ఎస్పీగా విశాఖ జిల్లా నర్సీపట్నంకు చెందిన కంచి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇక్కడ ఎస్పీగా పనిచేసిన డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి సీఐడీ విభాగానికి బదిలీ అయ్యారు.
- నూతన ఎస్పీ శ్రీనివాసరావు 2010లో గ్రూప్–1 ఆఫీసర్‌గా పోలీసుశాఖలో అడుగుపెట్టారు. పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరులో తొలి పోస్టింగ్ వచ్చింది. అనంతరం మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో పనిచేశారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు సీఐడీ ఆఫీసర్‌గా వెళ్లారు. అనంతరం విజయవాడ సౌత్‌జోన్ ఏసీపీగా పని చేశారు. విశాఖసిటీ అదనపు ఎస్పీ, స్పెషల్ బ్రాంచ్ అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వర్తించారు. శ్రీకాకుళం సెబ్ అదనపు ఎస్పీగా, జిల్లా శాంతి భద్రతల విభాగం అదనపు ఎస్పీగా సేవలందించారు. ప్రస్తుతం విజయవాడ ట్రాఫిక్ డీసీపీగా పనిచేస్తున్నారు. మొదటిసారి ఎస్పీగా అనంతపురం జిల్లాకు నియమితులయ్యారు. సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు పోలీసు అధికారవర్గాలు తెలిపాయి.

క్లుప్తంగా

మహాలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్న జెడ్పీ సీఈఓ



అమ్మవారి శేషవస్త్రాలను అందుకుంటున్న జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి దంపతులు

రొళ్ల: మండలంలోని రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవిని జెడ్పీ సీఈఓ భాస్కర రెడ్డి దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. విశేష పూజల అనంతరం అమ్మవారి శేషవస్త్రాలను, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, రాజవంశీకుడు రంగప్పరాజు, ఆపదమిత్ర వలంటీర్ పరమేష్, దేవదాయశాఖ సిబ్బంది, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా చీఫ్ కోచ్‌గా జగన్నాథరెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్‌గా జగన్నాథరెడ్డి నియమితులయ్యారు. దీంతో ఆన్‌సెట్ సీఈఓ కేశవ నాయుడు సమక్షంలో శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తున్న వెంకటరమణను హాకీ కోచ్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో జగన్నాథరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాలు జారీ చేసింది. అదే సమయంలో ఇప్పటి వరకూ ఆయన పనిచేసిన శ్రీసత్యసాయి జిల్లాకు ఇన్‌ఛార్జ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

325 మంది విద్యార్థుల గైర్హాజరు



కూడేరులో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

రాప్తాడురూరల్: పదో తరగతి పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షకు జిల్లాలో 325 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 29,951 మంది విద్యార్థులకు గాను 29,626 మంది పరీక్షలు రాశారు. జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరామ్ అనంతపురంలోని రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాల -1, 2 కేంద్రాలు, ఆర్డీటీ స్కూల్, రాప్తాడు ఏపీ మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ పాఠశాల కేంద్రాలను పరిశీలించారు. అలాగే ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ ఒక కేంద్రం, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 42 కేంద్రాలను పరిశీలించారు.

లోకేష్.. నోరు అదుపులో పెట్టుకో

- ఎమ్మెల్యేను విమర్శించే అర్హత నీకు లేదు
- అనుచిత వ్యాఖ్యలు చేస్తే తిరగనివ్వం
- వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం



బుక్కరాయసముద్రంలో నారా లోకేష్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుక్కరాయసముద్రం: శింగనమల నియోజకవర్గ ప్రజల సేవలో ఎప్పుడూ ముందుండే ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిపై అవాకులు చెవాకులు పేల కుండా నోరు అదుపులో పెట్టుకోవాలంటూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు హితవుపలికారు. ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వారు శనివారం బుక్కరాయ సముద్రంలోని అనంతపురం – తాడిపత్రి రహదారిపై లోకేష్ దిష్టిబొమ్మను దహనం చేశారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్, ఎంపీపీ సునీత, వైస్ ఎంపీపీ రామగోపాల్, సహకార పరపతి సంఘం అధ్యక్షుడు వెంకటరెడ్డి, సర్పంచ్ పార్వతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి తదితరులు మాట్లాడారు. శింగమల నియోజకవర్గంలో అనేక మంది ఎమ్మెల్యేలు, మంత్రులు, విప్‌లుగా పని చేసినవారు కూడా చేయని అభివృద్ధిని జొన్నలగడ్డ పద్మావతి చేసి చూపించారన్నారు.

పండుగలా వ్యవసాయం..

ఈ ప్రాంత రైతుల చిరకాలడిమాండ్‌గా ఉన్న శింగనమల చెరువు లోకలైజేషన్‌ను టీడీపీ హయాంలో నిర్లక్ష్యం చేశారన్నారు. పద్మావతి ఎమ్మెల్యే అయ్యాక శింగనమల చెరువును నింపడంతో పాటు లోకలైజేషన్‌కు కృషి చేశారన్నారు. సకాలంలో వర్షాలు కురవాలని సొంత ఖర్చుతో వరుణయాగం చేశారని గుర్తు చేశారు. ఆమె వచ్చినప్పటి నుంచి ఈరోజు వరకు ప్రతి ఏటా నియోజకవర్గంలోని చెరువులు నీటితో కళకళలాడుతున్నాయన్నారు. రైతులు వ్యవసాయాన్ని ప్రతిరోజూ పండుగలా చేసుకుంటున్నారన్నారు. దైవభక్తి కలిగిన మా ఎమ్మెల్యే సొంత ఖర్చుతో తెప్పోత్సవం, రాములోరి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారన్నారు.

కోవిడ్ విపత్తులో ఎనలేని సేవలు..

కరోనా తొలిదశలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి– ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి దంపతులు రూ.19 లక్షలు ఖర్చు చేసి తమ సొంత కాలేజీలో కోవిడ్ కేర్ సెంటర్‌ను ప్రారంభించి సేవలందించారన్నారు. రెండో విడతలో రూ.25 లక్షలు ఖర్చుపెట్టి ఆక్సిజన్ సిలిండర్లను అందుబాటులోకి తెచ్చి రోగులను కాపాడారన్నారు. మీలా ప్రాణభయంతో హైదరాబాద్‌కు వెళ్లి జూమ్ మీటింగ్‌లు పెట్టుకోలేదని లోకేష్– చంద్రబాబులను విమర్శించారు. తమ ఎమ్మెల్యే నిత్యం ప్రజలతో మమేకమై ఉంటారన్నారు. మీ టీడీపీ నాయకులు మాత్రం హైదరాబాద్‌లో ఉంటూ పబ్బం గడుపుతున్నారన్నారు. మూడు, నాలుగు నెలలకోసారి వచ్చి మొహం చూపి వెళ్తుంటారని ఎద్దేవా చేశారు.

మోస్ట్ అవినీతిపరుడు లోకేష్..

ఒక్క కెనాల్ లైనింగ్ వర్క్‌లకే రూ.150 కోట్ల కమీషన్ తీసుకున్న మోస్ట్ అవినీతిపరుడు నారా లోకేష్ అని విమర్శించారు. టీడీపీ హయాంలో తారు తక్కువ, అవినీతి ఎక్కువ కావడంతో రోడ్లన్నీ కొట్టుకుపోయాయన్నారు. అందుకే దుమ్ము ధాటికి నీకు తుమ్ములు వచ్చాయని మీ నాన్న చంద్రబాబు వద్ద చెప్పుకోవాలంటూ సూచించారు. గురుకుల పాఠశాల వైఎస్సార్ హయాంలో మంజూరు చేశారని. పనులకు సంబంధించిన బిల్లులను టీడీపీ హయాంలో చెల్లించక పోవడం సిగ్గుచేటన్నారు. స్వయానా టీడీపీ కాంట్రాక్టర్‌నే మీరు ఇబ్బందులపాలు చేశారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే పద్మావతి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో రూ.82 కోట్లతో వేసిన బీటీ, సీసీ రోడ్లు మీకు కనిపించలేదా అని ప్రశ్నించారు. ఆలూరు సాంబశివారెడ్డి 500 ఎకరాలు కబ్జా చేశారని ఆరోపించారని, ఆ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో చూపితే పేదలకే పంచిపెట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

పాదయాత్ర ఉద్దేశం తెలియని అజ్ఞాని..

పాదయాత్ర ఉద్దేశం ఏంటో తెలియని అజ్ఞాని నారా లోకేష్ అని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. యువగళం పేరుతో చేస్తున్న పాదయాత్రలో ఎక్కడికక్కడ అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులపై విమర్శలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ ముందుకెళ్తున్నారన్నారు. మిడిమిడి జ్ఞానంతో నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదన్నారు. తమ ఎమ్మెల్యే పద్మావతిపై నోరుజారితే లోకేష్‌కు మీసం కొరిగి చేతిలో పెడతామని హెచ్చరించారు. నియోజకవర్గంలోనూ తిరగకుండా ఎక్కడికక్కడ అడ్డుకుంటామన్నారు.

లోకేష్ మూర్ఖుడు..

ఎమ్మెల్యేకు, నాయకుడికి తేడా ఏంటో తెలియని మూర్ఖుడు లోకేష్ అని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. రాజకీయాల్లో భార్యకు భర్త అండగా ఉండటాన్ని పెత్తనమంటున్నారే.. మరి నియోజకవర్గంలో ఒక రెడ్డిని, మరొక నాయుడిని ద్విసభ్య కమిటీగా నియమించి టీడీపీ ఎస్సీ నాయకురాలిపై పెత్తనం చేయడాన్ని ఏమంటారో చెప్తారా అని ప్రశ్నించారు. ఆలూరి సాంబశివారెడ్డి నీలా తండ్రిని అడ్డుపెట్టుకుని డిగ్రీ కొనలేదన్నారు. ఇంజినీరింగ్ కళాశాల స్థాపించి విద్యారంగంలో రాణిస్తుండటమే కాకుండా రాజకీయాల్లోనూ సేవలందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బుల్లే నారాయణస్వామి, ముత్యాలశీన, కొండమ్మ, నందినేని మల్లికార్జున, పురుషోత్తం, కొండన్న, బూసీ, సాకే లక్ష్మీ నారాయణ, రంగనాథ్, కుల్లాయప్ప, నాగరాజు, రామ్మోహన్‌రెడ్డి, రాజా, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత బలవన్మరణం



లక్ష్మి (ఫైల్)

గుంతకల్లు రూరల్: కుటుంబసభ్యుల వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం దంచర్ల గ్రామానికి చెందిన సుంకన్న, సుంకమ్మ దంపతుల కుమారుడు రంగస్వామికి ఏడేళ్ల క్రితం కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పులికొండ గ్రామానికి లక్ష్మి (27)తో వివాహమైంది. ప్రస్తుతం వీరికి ఐదేళ్ల వయసున్న కుమారుడు, మూడేళ్లు, ఏడాది వయసున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల భర్తతో పాటు అత్తమామల వేధింపులు పెరిగిపోవడంతో లక్ష్మి పూర్తిగా విసిగిపోయింది. శుక్రవారం వేధింపులు తాళలేక క్రిమి సంహారక మందు తాగింది. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక శనివారం తెల్లవారుజాము 3 గంటలకు ఆమె మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు గుంతకల్లు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

బ్లేడుతో గొంతుకోసుకుని యువతి మృతి



షబ్బు (ఫైల్)

గార్లదిన్నె: మానసిక స్థితి సరిగా లేని ఓ యువతి బ్లేడుతో గొంతు కోసుకుని మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. గార్లదిన్నె మండలం మర్తాడుకు చెరందిన ఖాజాహుస్సేన్ కుమార్తె షేక్ షబ్బు (27) కొంత కాలంగా మానసిక స్థిమితం సరిగా లేక బాధపడుతోంది. కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాత్రూంలోకి వెళ్లిన షబ్బు అక్కడున్న బ్లేడ్ తీసుకుని గొంతు కోసుకుని మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

దమ్ముంటే చర్చకు రా!

- ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు ఎమ్మెల్సీ శివరామిరెడ్డి సవాల్
- అభివృద్ధిపై మాట్లాడే నైతికహక్కు టీడీపీకి లేదు
- లోకేష్ ద్వారా అబద్ధాలు చెప్పించడం తగదు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

ఉరవకొండ: ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోని టీడీపీకి అభివృద్ధిపై మాట్లాడే నైతిక హక్కు లేదని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి అంతా తమదేనంటూ నారా లోకేష్‌తో అబద్ధాలు చెప్పించడం కాదని దమ్ముంటే బహిరంగ చర్చకు వచ్చి నిరూపించాలని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు సవాల్ విసిరారు. వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని తన స్వగృహంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేగా పయ్యావుల కేశవ్ నాలుగుసార్లు గెలిచినా నియోజకవర్గానికి ఒరిగిందేమి లేదన్నారు. హంద్రీ–నీవా ద్వారా ఈ ప్రాంతానికి నీరు ఇచ్చిన ఘనత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దాదాపు రూ.86వేల కోట్లతో పీఏబీఆర్ నుంచి ఉరవకొండ నియోజకవర్గానికి తాగునీరు అందించేందుకు డాక్టర్ వైఎస్సార్ చేసిన కృషిని కొనియాడారు. ఉరవకొండ ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి 2012లో తాను ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు రాబట్టినట్లు గుర్తు చేశారు. దీంతో పాటు నియోజకవర్గంలో గురుకుల పాఠశాలలు, పాలిటెక్నిక్, బాలికల జూనియర్, ఐటీఐ కళాశాల ఏర్పాటు వెనుక తన కృషిని వివరించారు. వీటిని మరుగున వేస్తూ కేశవ్ నిస్సిగ్గుగా తానే అన్నీ తెచ్చినట్లు అబద్ధాలను లోకేష్ ద్వారా చెప్పించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీని, చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ జయచంద్రనాయుడు, మాజీ ఎంపీపీ రమణారెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రమణారెడ్డి, కొనకొండ్ల సర్పంచ్ ఇందిరమ్మ, గంజికుంట సర్పంచ్ జయేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు తగదు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: మహిళా ప్రజాప్రతినిధి అని కూడా గౌరవమివ్వకుండా శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని నారా లోకేష్‌కు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య హితవు పలికారు. యువగళం పాదయాత్రకు ప్రజల నుంచి స్పందన కరువవ్వడంతో వైఎస్సార్‌సీపీలపై నిరాధార ఆరోపణలు చేసి జనాన్ని ఆకర్షించాలనుకోవడం లోకేష్ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే పద్మావతి, ఆమె భర్త, రాష్ట్ర విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డిపై లోకేష్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. నియోజకవర్గంలో పెత్తనమంతా ఆలూరు సాంబశివారెడ్డిదేనని, ఆయన ఎలా చెబితే ఎమ్మెల్యే అలా నడుచుకుంటోందంటూ మహిళల ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేలా మాట్లాడడం సరికాదన్నారు. శింగనమల ప్రజల చిరకాల స్వప్నంగా ఉన్న చెరువును లోకలైజేషన్ చేయడం వెనుక ఎమ్మెల్యే పద్మావతి కృషి మరువలేనిదన్నారు. పుట్లూరు, యల్లనూరు చెరువులకు నీళ్లివ్వడంతో పాటు వివిధ గ్రామాల్లో రహదారుల నిర్మాణం పద్మావతి చొరవతోనే జరిగాయన్నారు. పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్ మాట్లాడుతూ.. శింగనమల అభివృద్ధికి పాటుపడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిపై అనుచిత వాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. సమావేశంలో పార్టీ అనుబంధ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రిలాక్స్ నాగరాజు, నాయకులు ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ఓర్వలేకే విమర్శలు..

శింగనమల నియోజకవర్గ అభివృద్ధిని చూసి ఓర్వలేక నారా లోకేష్ చవకబారు ఆరోపణలు చేస్తున్నాడని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎగ్గుల శ్రీనివాసులు అన్నారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకునేందుకే ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త ఆలూరు సాంబశివారెడ్డిపై దిగజారుడు ఆరోపణలు చేస్తున్నాడని మండిపడ్డారు.

కేబుల్ దొంగల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

బత్తలపల్లి: మండలంలోని మాల్యవంతంలో వరుస కేబుల్ చోరీకి పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను శనివారం ఎస్ఐ టీవీ శ్రీహర్ష వెల్లడించారు. అనంతపురంలోని నాయక్‌నగర్ నివాసి మామిళ్ల రామకృష్ణ, బత్తలపల్లి మండలం మాల్యవంతం నివాసి సాకే అశోక్ ఇద్దరూ స్నేహితులు. వ్యసనాలకు బానిసలైన వీరు సులువుగా డబ్బు సంపాదించేందుకు మాల్యవంతంలోని రైతులకు సంబంధించిన వ్యవసాయ పరికరాలు, కేబుల్ వైర్లు అపహరించుకెళ్లి, కర్ణాటక ప్రాంతంలో విక్రయించి, సొమ్ము చేసుకునేవారు. ఇటీవల వరుస దొంగతనాలు చోటు చేసుకోవడంతో నిఘా పెంచిన పోలీసులు పక్కా ఆధారాలతో శనివారం నిందితులను అరెస్ట్ చేశారు. వీరి నుంచి కేబుల్ వైర్లు, ఐదు విస్కీ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

అలరించిన జార్ఖండ్ కళాకారులు



నృత్య రూపకంలోని ఓ సన్నివేశం

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన జార్ఖండ్ భక్తులు శనివారం చౌ నృత్య రూపకాన్ని ప్రదర్శించి అలరించారు. ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత భగవద్గీతలోని 12వ అధ్యాయాన్ని, సత్యసాయి చాలీసాను పఠించారు. సాయంత్రం జార్ఖండ్‌లోని సారికేళి చౌ నాట్య అకాడమీకి చెందిన కళాకారులు నృత్యరూపకంతో ఆకట్టుకున్నారు.

నెత్తురోడిన రహదారులు






కళ్యాణదుర్గం: సతీష్, నందు (ఫైల్), ఉరవకొండ: రాయంపల్లి వద్ద మృతి చెందిన గంగన్న (ఫైల్) సర్వజనాస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న విశ్వ

- వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం



ఆత్మకూరు: ప్రమాదంలో నుజ్జునుజ్జైన ఆటో

ఆత్మకూరు/కళ్యాణదుర్గం: అతి వేగం... నిర్లక్ష్యం మూడు ప్రాణాలను బలిగొంది. జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ప్రమాదాల్లో ఇద్దరు యువకులు, ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన మేరకు...

కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామానికి చెందిన సతీష్ (25) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం అనంతపురంలోని మార్కెట్ యార్డులో జరిగే పొట్టేళ్ల సంతకు జీవాలను తరలించేందుకు సతీష్ ఆటోను అదే గ్రామానికి చెందిన వ్యాపారులు శ్రీనివాసులు, నందు, ఓబులేసు అద్దెకు మాట్లాడుకుని బయలుదేరారు. ఆత్మకూరు వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో ఆటో రోడ్డు పక్కకు బోల్తాపడింది. ఆటో డ్రైవర్ సతీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. శరీరభాగాలు తునాతునకలై ఎనిమిది పొట్టేళ్లు మృతి చెందాయి. ప్రమాదానికి కారణమైన బొలెరో డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. ఆటోలో ప్రయాణిస్తున్న శ్రీనివాసులు, నందు, ఓబులేష్ తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళుతున్న వారు క్షతగాత్రులను గమనించి 108 అంబులెన్స్ ద్వారా అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు నందు (18)ని కర్నూలుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గోళ్లలో విషాదఛాయలు

గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారనే వార్త తెలియగానే గోళ్లలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబసభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి. మృతదేహాలను గ్రామానికి తీసుకువచ్చిన వెంటనే పెద్ద సంఖ్యలో ప్రజలు అక్కడకు చేరుకుని విలపించారు. కాగా, పది రోజులుగా గ్రామంలో ఆరుగురు మృత్యువాత పడ్డారు. ఇందులో ఓ యువతి ఆత్మహత్య చేసుకోగా, మరో ఇద్దరు గుండె పోటుతో, మరొకరు వృద్ధాప్యంతో మృతి చెందారు. తాజాగా రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందడంతో గ్రామానికి ఏదో అరిష్టం దాపురించిందనే అపోహలు వ్యాప్తి చెందాయి. దీంతో గ్రామస్తులు భయభ్రాంతులకు లోనయ్యారు.

ఆటో బోల్తా..

ఉరవకొండ: విడపనకల్లు మండలం పాల్తూరులో మిర్చి పంట తొలగించేందుకు శనివారం ఉదయం వజ్రకరూరు మండలం పీసీ ప్యాపిలి గ్రామం నుంచి 16 మంది కూలీలతో బయలుదేరిన ఆటో ఉరవకొండ సమీపంలోని రాయపల్లి వద్దకు చేరుకోగానే బోల్తాపడింది. అతి వేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. ఘటనలో పీసీ ప్యాపిలికి చెందిన గంగన్న (55) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన కుమారి, గంగమ్మ, మల్లమ్మ, ఇంద్రమ్మ, నారాయణమ్మ, సునీత, గౌరిని స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా తొలుత ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై ఉరవకొండ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సర్వజనాస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. ఈ సందర్భంగా ఆయన వెంట బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, పీసీ ప్యాపిలి నాయకులు కృష్ణ, భీమప్ప, వీరా, రమేష్ ఉన్నారు.